ఎంగిలిపూల వేడుకలు

జగిత్యాల రూరల్/కోరుట్ల/కోరుట్లటౌన్/రాయికల్/సారంగాపూర్/పెగడపల్లి/మల్యాల: ఎంగిలిపూల బతుకమ్మ పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా తీరొక్క పూలు తెచ్చి చిన్న బతుకమ్మ పేర్చి ఆట, పాటలు పాడి సంబురాలు నిర్వహించారు.జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో, పెగడపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సారంగాపూర్, బీర్పూర్ మండలాల్లో, కోరుట్ల పట్టణంలోని భీము నిదుబ్బలో ఎంగిలిపూల బతుకమ్మ పండుగ వేడుకలను బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు బతుకమ్మను అలంకరించి సంప్రదాయ రీతుల్లో బతుకమ్మ పాటలు పాడి కోలాటాలు ఆడారు.


జగిత్యాల రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మతో మహిళలు, అధికారులు


నాగునూర్‌లో బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తున్న మహిళలు


జగిత్యాల టౌన్ బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పెగడపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కోరుట్లలో బతుకమ్మలతో మహిళలు


కోరుట్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

క్లుప్తంగా

రోడ్ల మరమ్మతు చేపట్టాలి


అధికారులతో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

రాయికల్: మండలంలోని వీరాపూర్‌లో ఇటీవల కురిసిన వర్షాలతో తెగిపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సూచించారు. ఆదివారం వీరాపూర్‌లో రోడ్లను పరిశీలించి మాట్లాడారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఫోన్లో ఆదేశించారు. గ్రామంలో ఇటీవల తాగునీటితో గ్రామస్తులు ఇబ్బంది పడగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు సోమ వెంకటేష్, సుందనగిరి గంగాధర్, నీలి మహేష్ ,దుంపల నర్సారెడ్డి, జవ్వాజి నవీన్, దిండిగల రామస్వామి, షేక్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభ్యున్నతికి ఆర్‌ఎస్‌ఎస్ కృషి


కార్యక్రమంలో స్వయం సేవకులు

మెట్‌పల్లి: దేశ అభ్యున్నతికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాటుపడుతోందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యకారిని సభ్యుడు బూర్ల దక్షిణామూర్తి అన్నారు. పట్టణంలోని కళానగర్ సరస్వతీ శిశు మందిర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ క్రమశిక్షణ కలిగిన దేశ భక్తులను తయారు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, పోతు లక్ష్మణ్, గోనె భూమయ్య, గోల్కొండ నాగరాజు, వీర్ల వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

సస్యరక్షణ చర్యలతో దోమపోటు నివారణ


వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవో

మెట్‌పల్లి రూరల్: వాతావరణంలో జరిగే మార్పులతో వరికి దోమపోటు సోకుతుందని ఏఈవో నరేశ్ అన్నారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో వరి పంటను ఆదివారం పరిశీలించి మాట్లాడారు. దోమపోటు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టాన్ని నివారించవచ్చని స్పష్టం చేశారు. వరిపైర్‌ను ఆశించిన దోమ నివారణకు పొలంలో ప్రతి 2 మీటర్లకు 20 సెంటీ మీటర్లు పాయలు తీసి, తర్వాత పైమెట్రోజిన్ 0.5 గ్రామ్ లేదా డెనోటిపురాన్ 0.4 గ్రామ్ లేదా ట్రిఫ్లుమేజోపైరిమ్ 0.5 గ్రామ్ ఒక లీటర్ నీటికి కలుపుకొని స్ప్రే చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ భావం


క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న సీఐ కరుణాకర్

జగిత్యాలటౌన్: క్రీడలతో దేహధారుడ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పట్టణంలోని మినీస్టేడియంలో నిర్వహిస్తున్న జగిత్యాల ప్రీమియర్ లీగ్ పోటీలను సీఐ కరుణాకర్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై రవికిరణ్, ఏఆర్ ఎస్సై వినోద్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ కౌన్సిలర్ చుక్క నవీన్,లీగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎల్లాపూర్‌లో బీఆర్ఎస్ సమావేశం

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండావిష్కరణ అనంతరం నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన గ్రామాభివృద్ధిని ప్రజలకు వివరించి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ జెండా ఎగుర వేసేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు రంగు శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, మల్లేశం, వినోద్, శ్రీరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి


కోరుట్లలో నివాళి అర్పిస్తున్న నాయకులు


మల్లాపూర్‌లో నాయకుల నివాళి


మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి/కోరుట్ల/మల్యాల/పెగడపల్లి/మల్లాపూర్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆదివారం మెట్‌పల్లి,కోరుట్ల, మల్యాల, పెగడపల్లి,మల్లాపూర్‌లో కొండా లక్ష్మణ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలుచోట్ల పద్మశాలీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.


మల్యాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు


పెగడపల్లిలో పద్మశాలీ సంఘం నాయకుల నివాళి



కథలాపూర్: మండల కేంద్రం నుంచి ఐదు గ్రామాలకు వెళ్లే రోడ్డు కథలాపూర్ గ్రామంలోనే గుంతలమయంగా మారడంతో వాహనాలపై వెళ్లేవారు, కాలినడకన పోయేవారు ఇబ్బందిపాలవుతున్నారు. వర్షం కురిస్తే మరింత బురదగా మారి బైకులు, ఆటోలు అదుపు తప్పుతున్నాయని పలువురు వాపోతున్నారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చొరవ చూపి గుంతల రోడ్డును త్వరగా మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగదీశ్వర్, పంచాయతీరాజ్ ఏఈ, కథలాపూర్, సెల్ నంబర్: 9100853882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రాజ్యాంగ హక్కులపై అవగాహన ఉండాలి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: భారత రాజ్యాంగంలో బీఆర్ అంబేడ్కర్ కల్పించిన హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడు తమ హక్కులను పొందడంతో పాటు రాజ్యాంగం పట్ల, దేశం పట్ల బాధ్యత కలిగి ఉండటమే అంబేడ్కర్‌కు అర్పించే అసలైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకుడు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, అనంతుల కాంతారావు, ద్యావర సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్ అమలు చేయాలి


మాట్లాడుతున్న చింత భూమేశ్వర్

కోరుట్లటౌన్: బీడీ కార్మికులకు ఆంక్షలు లేకుండా ఆసరా పెన్షన్ రూ.4 వేలు అమలు చేయాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింత భూమేశ్వర్ అన్నారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి. సూర్యశివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.హరిత, భారతి, రాష్ట్ర కమిటీ కరీంనగర్, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధులు ఎస్. గంగాధర్, అరుణ, జె.గంగాధర్, శివకుమార్, గౌరవాధ్యక్షుడు బి.భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

జగిత్యాలటౌన్: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా చేపట్టిన సేవాపక్షం 2025 కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల పట్టణంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సేవా పక్వాడా జగిత్యాల పట్టణ ఇన్‌చార్జి షిండేరు భానుప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పలువురు విద్యార్థులు పాల్గొని తమ దేశభక్తిని చాటుకున్నారు. లింగ హర్షిణి గీసిన ప్రధాని మోదీ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రథమ బహుమతికి ఎంపికైంది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాగిల్ల సత్యనారాయణ, దశరథరెడ్డి, సాంబారి కళావతి, కొక్కు గంగాధర్, భానుప్రియ, చెన్నాడి మధురిమ, రాజన్న పాల్గొన్నారు.

ఆలయ పూజారికి ఆర్థికసాయం

సారంగాపూర్: మండలంలోని ధనాయక్‌తండా గిరిజన గ్రామ పూజారికి గ్రామస్తులు ఆదివారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ధర్మనాయక్‌తండా గ్రామ శివారులో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ పూజారిగా బట్టు నందునాయక్ పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఆలయ పూజారి భార్య గుండెపోటుతో మృతిచెందగా, యువకులంతా కలిసి నందు నాయక్ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

రాయికల్: పట్టణానికి చెందిన దొంతి సతీష్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఇటీవల ఎంపిక కాగా, ఆదివారం రాయికల్ పట్టణంలో పదో తరగతి స్నేహితులు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ గట్టు నరేశ్, కోల రాజు, తిరుపతి, రంజిత్, అజయ్, సురేష్, అనిల్, విజయ్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పిత్రు అమావాస్య అన్న ప్రసాద వితరణ

కోరుట్లటౌన్: సనాతన ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం పిత్రు అమావాస్య అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట గోపూజ, అన్నపూర్ణ మాత పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సత్కార్యం ఫలితం పితృదేవతల అనుగ్రహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార సమితికి సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పక్షేత్రంలో..

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పక్షేత్రంలో ఆదివారం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇకపై ప్రతి అమవాస్య రోజున భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి మిట్టపల్లి లక్ష్మీనారాయణ, గుండేటి మోహన్, కుర్రె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


భానుప్రసాద్‌రావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు తల్లి తానిపర్తి ప్రేమలత ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో భానుప్రసాద్‌రావును కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు.

మధుయాష్కీకి..

రాయికల్: ఇటీవల అస్వస్థతకు గురైన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, మధుయాష్కీ గౌడ్ ను ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హైదరాబాద్ లో పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితి పై అడిగి తెలుసుకున్నారు.

వేతనాలు ఇప్పించాలని ఎంపీవోకు వినతి


ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న జీపీ కార్మికులు

జగిత్యాల రూరల్: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు తమకు రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఆదివారం ఎంపీవో రవిబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, దసరా పండగలకు తమను, తమ కుటుంబాలను పస్తులు ఉంచొద్దని, వెంటనే రెండు నెలల వేతనాలు చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న అధికారులు

కథలాపూర్: గ్రామాల్లో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య తీర్చడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో కోరుట్ల ఏడీఈ రఘుపతి అన్నారు. మండలంలోని అంబారిపేటలో మూడు 25 కేవీ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, గంభీర్‌పూర్‌లో ఐదు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఆదివారం ప్రారంభించారు. గృహ వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అంబారిపేట సెక్షన్ ఏఈ భూమేశ్వర్, సబ్ ఇంజినీర్ భరత్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

బుగ్గారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో వివిధ ప్రాంతాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా బాల్యవివాహాల నిరోధక ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ భూమేశ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి జట్టు క్రీడలు నిర్వహించగా నేడు అథ్లెటిక్స్ జరగనున్నాయి. కార్యక్రమంలో స్థానిక జీపీ కార్యదర్శి అక్బర్,మై భారత్ సంస్థ ప్రతినిధులు మారం గణేష్,సుంకం ప్రశాంత్,రాహుల్,సుశాంత్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా సత్యం

మల్యాల: మండలంలోని రామన్నపేటలో ఆదివారం స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుమ్మనపల్లి సత్యం, ఉపాధ్యక్షుడిగా శంకరయ్య, కోశాధికారిగా తులసిదాస్, కార్యదర్శిగా విఠల్‌చారి తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎల్లాపూర్ విద్యార్థినికి మెడిసిన్‌లో సీటు

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఇరుగురాల తేజశ్రీ అనే విద్యార్థిని మెడిసిన్‌లో సీటు సాధించింది. గ్రామానికి చెందిన ఇరుగురాల లక్ష్మణ్-భవాని కూతురు తేజశ్రీ 5వ తరగతి నుంచి 10 వరకు మల్లాపూర్‌లోని గురుకుల పాఠశాలలో చదువుకుంది. అనంతరం ఇంటర్ మీడియట్ కరీంనగర్ ఓ ప్రైవేట్ కళాశాలలో చదివిన తేజశ్రీ నీట్‌లో నాలుగు వేల ర్యాంకు సాధించింది. దీంతో హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో మెడిసిన్ సీటు వచ్చిన ట్లు తేజశ్రీ తండ్రి లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. మెడిసిన్‌లో సీటు సాధించిన తేజశ్రీని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మెట్‌పల్లి: పట్టణంలోని టౌన్-2 సెక్షన్ పరిధిలోని సుల్తాన్‌పురా, మెట్‌పల్లి క్లబ్, కేడీసీసీ బ్యాంక్ ఏరియాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.